


దుబ్బాకలో మోడల్ బస్టాండు భవనం



దుబ్బాకలో ఒకేచోట వెయ్యి డబుల్ బెడ్ రూం ఇండ్లతో మోడల్ కాలనీ




దుబ్బాకలో వంద పడకల దవాఖాన

# అభివృద్ధికే పట్టం..

- దుబ్బాక గడ్డ.. గులాబీ అడ్డా
- ఉద్యమగడ్డపై బీఆర్ఎస్ గుబాళింపు
- బీఆర్ఎస్‌కే జై కొట్టిన దుబ్బాక ప్రజలు
- ప్రభాకర్‌రెడ్డికి పట్టం కట్టిన దుబ్బాక జనం
- అత్యధిక మెజార్టీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు 'కొత్త'కు నాలుగో స్థానం
- తెలంగాణ ఉద్యమసమయంలో కీలకంగా దుబ్బాక



దుబ్బాకలో రాజమహల్ తలపించే కేసీఆర్ బడి


దుబ్బాక, డిసెంబర్ 5 : ఉద్యమగడ్డ దుబ్బాకలో గులాబీ జెండా రెపరెపలాడింది. దుబ్బాక బీఆర్ఎస్‌కు కంచుకోటగా మారింది. ఉద్యమాల పురిటి గడ్డగా పేరొందిన దుబ్బాకలో రాజకీయ చైతన్యం ఎక్కువే. ఈ గడ్డ ఉద్యమాలతో పాటు పలు రాజకీయ పార్టీలను ఆదరించి చైతన్య వేదికగా నిలిచింది. తెలంగాణ ఉద్యమ సమయంలో దుబ్బాక గడ్డ కీలకంగా మారింది. తెలంగాణ ఉద్యమాన్ని రగిలించడంతో పాటు ఉవ్వెత్తున ఎగిసేందుకు ఈ ప్రాంత ఉద్యమకారుల కృషి ఎనలేనిది. ఈ గడ్డపై విద్యనభ్యసించిన కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు రెండు సార్లు ముఖ్యమంత్రిగా పని చేశారు. తన ఎదుగుదలకు కారణం దుబ్బాక గడ్డనే అని కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. విద్యబుద్ధులు నేర్పిన దుబ్బాకపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఎనలేని ప్రేమ ఉన్నది. ఇటీవల (పది రోజుల కిందట) దుబ్బాకలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన కేసీఆర్ దుబ్బాకపై తనకున్న ప్రేమాభిమానాన్ని ప్రజలతో పంచుకున్నారు. కేసీఆర్‌పై మమకారం, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై ఉన్న నమ్మకంతో దుబ్బాక ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు.

### దుబ్బాకలో ఉద్యమంలా పోలింగ్..

తెలంగాణ ఉద్యమం నుంచి దుబ్బాక బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉంది. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి దుబ్బాక ప్రజలు గులాబీ పార్టీకే జై కొట్టారు. 2020 ఉప ఎన్నికల్లో కొన్ని కారణాలతో బీజేపీ స్వల్ప మెజార్టీతో విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ పార్టీకే నియోకవర్గ ప్రజలు పట్టం కట్టారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి భారీ మెజార్టీని అందించి దుబ్బాక గడ్డపై గులాబీ జెండా ఎగురవేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా అత్యధికంగా పోలింగ్ జరిగింది. ఉద్యమంలా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 1,01,081 మంది మహిళలు, 97,019 మంది పురుషులు, మొత్తం 1,98,100 ఓటర్లు ఉన్నారు. ఇందులో 87,815 మహిళలు, 85,555 మంది పురుషులు మొత్తం 1,73,370 మంది (87.51%) ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఓటేసేందుకు ఓ ఉద్యమంలా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. గతంతో పోల్చితే ఈ ఎన్నికల్లోనే దుబ్బాక నియోజవకర్గంలో అత్యధికంగా పోలింగ్ జరగడం విశేషం. గత 2018 ఎన్నికల్లో 85 శాతం పోలింగ్ కాగా..ఈ ఎన్నికల్లో 87 శాతం పోలింగ్ జరిగింది.

### బీఆర్ఎస్ వెంటే దుబ్బాక ప్రజలు

తెలంగాణ ఉద్యమం నుంచి దుబ్బాక ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ హవా కొనసాగినా దుబ్బాకలో మాత్రం బీఆర్ఎస్ కారు జోరు కొనసాగింది. ఇక్కడ కాంగ్రెస్‌కు కనీసం డిపాజిట్ దక్కకుండా పోయింది. దుబ్బాక ప్రజలు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలిపి రాష్ట్రస్థాయిలో రికార్డు సృష్టించారు. అత్యధిక పోలింగ్‌తో పాటు ఫలితాల్లో ప్రత్యర్థులను చిత్తు చేసి బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఘన విజయాన్ని అందించారు. దుబ్బాక నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 1,73,370 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి 97,451 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావుకు 43,744 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి 24,947 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి సల్కాం మల్లేశానికి 1197 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్‌కు అందనంత దూరంగా దిగువ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్‌లు ఉండిపోయాయి. ఎన్నికల ఫలితాల్లో తొలి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు ప్రతి రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మెజార్టీ ఇచ్చారు. 253 పోలింగ్ కేంద్రాల్లో కేవలం రెండు పోలింగ్ కేంద్రాల్లో (తొగుట, తుక్కాపూర్) కాంగ్రెస్‌కు స్వల్పంగా ఆధిక్యత రాగా , మిగిలిన 251 పోలింగ్‌కేంద్రాల్లో బీఆర్ఎస అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డికి మెజార్టీని అందించారు.కాంగ్రెస్ పార్టీకి కనీసం డిపాజిట్ దక్కక పోవడం విశేషం.



## అభివృద్ధికి పట్టం కట్టిన దుబ్బాక ఓటర్లు

దుబ్బాక నియోజకవర్గ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారు. తొమ్మిదేండ్లలో కేసీఆర్ (బీఆర్ఎస్) ప్రభుత్వంలోనే దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శంగా నిలిచింది. దుబ్బాక నియోజకవర్గంలో అధికంగా గ్రామీణ ప్రాంతాలు ఉంటాయి. ఇక్కడ రైతులు, బీడీ, చేనేత, గీత కార్మికులు అధికంగా ఉన్నారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, రైతులకు రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ , కేసీఆర్ కిట్ వంటి పథకాల వల్ల లబ్ధి పొందారు. మిషన్ భగీరథతో తాగునీరు, మల్లన్న సాగర్‌తో సాగునీటి కష్టాలు తీరాయి. నియోజకవర్గంలో ప్రధానవాగు కూడవెల్లి జీవనదిగా మారింది. రైతులకు పంట సాగు సమస్యలతో పాటు 24 గంటల కరెంట్ సరఫరా చేయడం వల్ల బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. వీటితో పాటు నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, మండల కేంద్రాలకు రోడ్లు, పలు చోట్ల వంతెనల నిర్మాణాలు జరిగాయి. దుబ్బాకలో విద్యనభ్యసించిన కేసీఆర్ బడికి రూ. 20 కోట్లు మంజూరు చేసి, అధునాతన హంగులతో రాజమహాల్‌ను తలపించే మాదిరిగా అద్భుతమైన పాఠశాల భవనాన్ని నిర్మించారు. మూడు జిల్లాలో సరిహద్దుగా ఉన్న దుబ్బాకలో రూ.20 కోట్లతో వంద పడకల దవాఖాన భవనం, పేదలకు ఒకే చోట వెయ్యి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి మోడల్ కాలనీగా ఏర్పాటు చేశారు. రూ. 4 కోట్లతో సకల హంగులతో మోడల్ బస్టాండ్ భవనం నిర్మించారు. దుబ్బాక మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలో నూతనంగా నార్సింగ్, రాయపోల్, అక్బర్‌పేట-భూంపల్లి మండలాలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ సర్కారులో నెలకొంది.

## దుబ్బాక నియోజకవర్గంలో గెలిచిన ఎమ్మెల్యేలు

| నియోకవర్గం | గెలిచిన ఎమ్మెల్యే | పార్టీ |
|---|---|---|
| 2004 దొమ్మాట | సోలిపేట రామలింగారెడ్డి | టీఆర్ఎస్ |
| 2008 దొమ్మాట (ఉప ఎన్నికల్లో) | సోలిపేట రామలింగారెడ్డి | టీఆర్ఎస్ |
| 2009 దుబ్బాక | చెరుకు ముత్యంరెడ్డి | కాంగ్రెస్ |
| 2014 దుబ్బాక | సోలిపేట రామలింగారెడ్డి | టీఆర్ఎస్ |
| 2018 దుబ్బాక | సోలిపేట రామలింగారెడ్డి | టీఆర్ఎస్ |
| 2020 ఉప ఎన్నికలలో | మాధవనేని రఘునందన్‌రావు | బీజేపీ |
| 2023 ప్రస్తుత ఎన్నికలలో | కొత్త ప్రభాకర్‌రెడ్డి | బీఆర్ఎస్ |

## అత్యధిక మెజార్టీలో.. నాలుగో స్థానంలో 'దుబ్బాక' ఎమ్మెల్యే

బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నాలుగో స్థానంలో నిలిచి రికార్డు సృష్టించారు. మెదక్ ఎంపీగా ప్రభాకర్‌రెడ్డి రెండు సార్లు భారీ మెజార్టీతో రికార్డు సృష్టించగా, ఈ ఎన్నికల్లో 53,513 ఓట్ల మెజార్టీతో ప్రత్యేకత చాటారు. బీఆర్ఎస్ పార్టీకి దుబ్బాక ప్రజలు భారీ మెజార్టీని అందించి, ఉద్యమ సత్తాను చాటుకున్నారు. రాష్ట్రంలో గెలుపొందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలో అత్యధిక మెజార్టీ ఓట్లతో గెలిచిన వారిలో 4వ స్థానంలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి నిలిచారు. మొదటి స్థానంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందకు 85,576 మెజార్టీ రాగా, ద్వితీయ స్థానంలో సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు 82,308 మెజార్టీ, తృతీయ స్థానంలో కుకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు 71,387, నాలుగో స్థానంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి 53,513 మెజార్టీతో ప్రత్యేకతను చాటుకున్నారు.



# కారుదే పైచేయి..

- పక్కా వ్యూహంతో మూడు స్థానాల్లో గెలుపు
- ఒక్క శాతం ఓటుతో రెండు చోట్ల ఓటమి
- పల్లెలు, పట్టణాలు బీఆర్ఎస్ వెన్నంటే..
- అలుపెరుగకుండా శ్రమించిన హరీశ్‌రావు
- నాయకులు, కార్యకర్తల సమన్వయంతో వరించిన విజయం
- ఎన్నికలేవైనా గులాబీ పార్టీకే జిల్లావాసుల మద్దతు




సంగారెడ్డి జిల్లాలో పట్టునిలుపుకొన్న బీఆర్ఎస్

సంగారెడ్డి డిసెంబర్ 5(నమస్తే తెలంగాణ) : సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుంటామన్న కాంగ్రెస్ కలలను బీఆర్ఎస్ పార్టీ తుత్తునియలు చేసింది. మొత్తం ఐదు సీట్లలో మూడింటిని సాధించి పట్టు నిలుపుకొన్నది. మాజీ సీఎం కేసీఆర్ సారథ్యం, మాజీ మంత్రి హరీశ్‌రావు పక్కా వ్యూహంతో సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్ గులాబీ ఖాతాలో చేరాయి. నారాయణఖేడ్, అందోలు స్థానాలను ఒక శాతం ఓటు తేడాతో కోల్పోవాల్సి వచ్చింది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఓటమికి గల కారణాలను బీఆర్ఎస్ విశ్లేషించుకుంటున్నది.

### బీఆర్ఎస్‌కు పెట్టని కోట

సంగారెడ్డి జిల్లా మొదటి నుంచి బీఆర్ఎస్ పార్టీకి పెట్టని కోటలా ఉన్నది. ప్రతి ఎన్నికల్లో ప్రజలు కేసీఆర్ వెన్నంటే ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్, జహీరాబాద్ ఎంపీ స్థానాలు బీఆర్ఎస్‌కే దక్కాయి. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నారాయణఖేడ్, జహీరాబాద్, అందోలు, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో ఉద్యమ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో స్వల్ప మెజార్టీతో పార్టీ ఓటమిపాలైనప్పటికీ ఆ తర్వాత జరిగిన జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఏకపక్ష తీర్పును ఇచ్చారు. జడ్పీ చైర్మన్ స్థానంతో పాటు ఎంపీపీ పదవులను కైవసం చేసుకున్నది. మున్సిపల్ ఎన్నికల్లోనూ జై కొట్టారు. జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీలకుగానూ ఏడు చోట్ల బీఆర్ఎస్ చైర్మన్లు గెలుపొందారు. ఇలా ప్రతి ఎన్నికల్లో సంగారెడ్డి ప్రజలు గులాబీ పార్టీకి అండగా నిలిచారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ కారు వెన్నంటే ఉన్నారు. చింతా ప్రభాకర్(సంగారెడ్డి), మహిపాల్‌రెడ్డి(పటాన్‌చెరు), మాణిక్‌రావు (జహీరాబాద్)లను గెలిపించారు.

### మొదటి నుంచి పక్కా వ్యూహంతో..

అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ పక్కా వ్యూహంతో బరిలోకి దిగింది. ఎన్నికల ప్రకటనకు ముందే కేసీఆర్ జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించటంతో పాటు బీఫామ్‌లు అందజేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పక్కా ప్రణాళికలతో ప్రతిపక్షపార్టీలను చిత్తు చేసేలా వ్యూహరచన చేశారు. అందుకనుగుణంగా నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలతో పాటు ప్రతి వంద మంది ఓటర్లకు ఒక బూత్ ఇన్‌చార్జిని నియమించారు. నియోజకవర్గాల్లో జోరుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. కేసీఆర్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావులు రోడ్‌షోలు, బహిరంగసభల్లో పాల్గొని అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం ఇంటింటి ప్రచారం చేస్తూ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ గెలుపు కోసం కష్ట పడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు వేసిన ఎత్తుగడలకుపై ఎత్తులు వేస్తూ గతంలో ఆ పార్టీల వైఫల్యాలు, స్వార్థ రాజకీయాలను వివరిస్తూ ప్రజల మద్దతు కూడగట్టడంలో సఫలమయ్యారు. ఐదు స్థానాల్లో మూడు చోట్ల గులాబీ జెండా ఎగురవేశారు. సంగారెడ్డిలో గెలుపు కోసం తన్నీరు హరీశ్‌రావు అలుపెరుగకుండా శ్రమించారు. మొదట నియోజకవర్గంలోని ముఖ్యనేతలు, నాయకులను ఏకతాటిమీదికు తీసుకువచ్చి సమన్వయంతో పనిచేసేలా చూశారు. ఫలితంగా చింతా ప్రభాకర్ తొమ్మిది వేల ఓట్ల మెజార్టీ సాధించారు. నియోజకవర్గంలోని సదాశివపేట మున్సిపాలిటీ, సదాశివపేట మండలం, కంది, కొండాపూర్ మండలాల ప్రజలు చింతా ప్రభాకర్‌కు దన్నుగా నిలిచారు. సదాశివపేట మున్సిపాలిటీలో అత్యధిక మెజార్టీని సొంతం చేసుకున్నారు. ఏడు వేలకుపైగా మెజార్టీతో మహిపాల్‌రెడ్డి పటాన్‌చెరు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొట్టారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా వాటికి ఛేదించుకుంటూ విజయతీరాలకు చేరారు. పటాన్‌చెరు, తెల్లాపూర్, బొల్లారం మహిపాల్‌రెడ్డికి మంచి మెజార్టీని ఇచ్చాయి. జహీరాబాద్‌లో గెలుపు కోసం హరీశ్‌రావు అక్కడి నేతలందరినీ సమన్వయం చేసి దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను దేవీప్రసాద్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌కు అప్పగించారు. దీంతో మాణిక్‌రావు కాంగ్రెస్‌పై 10వేలకుపైగా మెజార్టీతో పొందారు. బీఆర్ఎస్ గెలుపుతో మూడు నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొన్నది.

# ముసురేసింది..

## సిద్దిపేట జిల్లాలో మోస్తరు వాన

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 5 : సిద్దిపేట జిల్లాలో ఒక్కసారిగా వాతావరణ మారింది. తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఓ వైపు చలితో ఇబ్బంది పడుతున్న ప్రజలకు.. తుఫాన్ కారణంగా చలి తీవ్రత మరింత ఎక్కువైంది. చలి తీవ్రతతో ప్రజలెవరూ బయటకు ఎక్కువగా రావడం లేదు. పనుల కోసం బయటకు వచ్చే వారు స్వెట్టర్లు, మంకీ క్యాపులు ధరిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచే ఓ మోస్తరు వర్షం కురిసింది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడటంతో పాటు చిరుజల్లులు పడ్డాయి. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు సిద్దిపేట జిల్లాకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

### ఈదురుగాలులతో కూడిన వాన

వర్గల్, డిసెంబర్ 5: మంగళవారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం కలిగింది. చేతికొచ్చిన వరి ధాన్యాన్ని రోడ్లపైనే ఆరబెట్టారు.ముసురుకు చల్లటి ఈదురుగాలులు తోడయ్యాయి. అత్యవసర ప్రయాణాలు తప్పా ఎక్కు శాతం ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. మండలంలోని చాలా గ్రామాల్లో రోడ్లపైనే ఆరబెట్టిన ధాన్యంపై కవర్లు(పాలిథిన్) కప్పి ఉంచారు.





చలి తీవ్రతతో తలకు గుడ్డ కట్టుకొని వెళ్తున్న వాహనదారుడు

సిద్దిపేటలో చలి తీవ్రతతో స్వెట్టర్లు, మంకీ క్యాపులు ధరించిన ప్రజలు



వానకు తడవకుండా ధాన్యంపై కవర్లు కప్పిన రైతులు





వర్షం కారణంగా గొడుగుతో వెళ్తున్న ఓ వ్యక్తి